క్లుప్తంగా

దీపావళి ప్రజల జీవితాల్లో వెలుగులు నింపాలి

జెడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక



గుడ్లవల్లేరు: ఉమ్మడి కృష్ణాజిల్లా ప్రజలందరికీ జెడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలంతా సుఖ శాంతులు, సిరి సంపదలతో తులతూగాలని ఆకాంక్షించారు. తమ జీవితాల్లో ధన, ధాన్య రాశులను నింపుకుని సుభిక్షంగా ఉండాలని కోరారు.

జిల్లా ప్రజలకు ఎస్పీ దీపావళి శుభాకాంక్షలు



కోనేరుసెంటర్: కృష్ణా జిల్లా ప్రజలకు జిల్లా ఎస్పీ ఆర్.గంగాధర్ రావు దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. కుల మతాలకు అతీతంగా అన్ని వర్గాల ప్రజలు ఈ పండుగను కుటుంబసభ్యుల నడుమ సంతోషంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు. పర్యావరణ హితం మన మతం అనే నినాదంతో జిల్లా ప్రజలు పరిమిత టపాసులతో పండుగ చేసుకోవాలని సూచించారు. పర్యావరణాన్ని దృష్టిలో ఉంచుకుని కాలుష్య రహిత టపాసులను వినియోగించాలని కోరారు.

8 స్టాళ్లలో టపాసుల విక్రయాలకు అనుమతి

కోడూరు: దీపావళి టపాసులు విక్రయించేందుకు మండలంలో ఎనిమిది స్టాళ్లకు అనుమతించినట్లు తహసీల్దార్ బి.శ్రీనునాయక్ బుధవారం తెలిపారు. స్థానిక సంతమార్కెట్ ఆవరణలో స్టాళ్ల ఏర్పాటు చేసి టపాసుల విక్రయాలకు అనుమతించామని పేర్కొన్నారు. వ్యాపారులు నిబంధనలకు లోబడి టపాసులను విక్రయించాలని స్పష్టంచేశారు. ఎస్‌ఐ చాణిక్య స్టాళ్ల ఏర్పాటు ప్రాంతాన్ని పరిశీలించారు.

ముగిసిన హస్తకళల శిక్షణ

కృత్తివెన్ను: సంగమూడి ఉన్నత పాఠశాలలో మూడు రోజులుగా హస్తకళలపై విద్యార్థులకు నిర్వహిస్తున్న అవగాహన సదస్సు, శిక్షణ తరగతులు బుధవారం ముగిశాయి. విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన, డ్రాయింగ్ పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. వ్యాస రచనలో చైతన్య, సూర్యతేజ, డ్రాయింగ్‌లో గగన, రాజహంస ప్రథమస్థానాలు పొందినట్లు ఎంఈఓ-2 ఎస్.కె.డి.వి.ప్రసాదరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎంసీ చైర్మన్ సాంబశివ రావు, కె.శ్రీనివాసరావు, విజయవాడ హ్యాండీ క్రాఫ్ట్ సర్వీస్ సెంటర్ ప్రతినిధులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కార్నియాల సేకరణ

నాగాయలంక: మండలంలోని పెదకమ్మవారి పాలెం గ్రామానికి చెందిన ఆలూరి నారాయణ అలియాస్ సోమయ్య(72) విజయవాడ అయ్యప్పనగర్‌లో నివసిస్తూ బుధవారం మరణించారు. ఆయన గతంలో తన నేత్రాలను స్థానిక సుదర్శి మానవతా సేవాసంస్థ ద్వారా తాడిగడపలోని ఎల్వీప్రసాద్ కంటి ఆసుపత్రికి దానం చేశారు. సోమయ్య నేత్రాలను దానంచేసేందుకు భార్య శివలీల, కుమార్తె రోజా, అల్లుడు సతీష్ స్వచ్ఛందంగా ముందుకొచ్చారు. నేత్రదాన మోటివేటర్లుగా సేవలు అందిస్తున్న సుదర్శి మానవతా సేవాసంస్థ నిర్వాహకులు తలశిల రఘుశేఖర్, కె.వెంకట నారాయణను సంప్రదించి సమాచారం అందించగా వారి బంధువు సబ్బినేని భుజంగారావు సహకారంతో కంటి ఆస్పత్రి లాబ్ టెక్నీషియన్ సాయి బృందం సోమయ్య నేత్రాల నుంచి కార్నియాలను సేకరించి తీసుకెళ్లారు. తమ సంస్థ ద్వారా ఇప్పటికి సేకరించిన నేత్రాల సంఖ్య 212కి చేరిందని రఘుశేఖర్ చెప్పారు.

వరిలో దోమలను నివారించాలి



గూడూరు: ఖరీఫ్‌లో వరిసాగు చేసిన రైతులు దోమల నివారణపై దృష్టి సారించాలని వ్యవసాయ శాఖ జిల్లా వనరుల కేంద్రం సహాయ సంచాలకుడు కె.శ్రీనివాసరావు సూచించారు. పొలం పిలుస్తోందిలో భాగంగా బుధవారం రామరాజుపాలెం, కోకనారాయణపాలెం గ్రామాల్లో క్షేత్రసందర్శన చేసిన వ్యవసాయ అధికారులు రైతుల చేపట్టాల్సిన సస్యరక్షణ చర్యలపై సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఏడీఏ శ్రీనివాసరావు మాట్లాడుతూ.. ప్రస్తుతం గింజ గట్టిపడే దశలో ఉన్నందున పంటకు దోమ ప్రభావం ఎక్కువగా ఉంటుందన్నారు. దుబ్బుకు 20 నుంచి 25 దోమలకు మించి ఉంటే నివారణ మందు పిచికారీ చేయాలని సూచించారు. మండల వ్యవసాయ శాఖ అధికారి కె.ఆంజనేయకుమార్, వీఏఏలు కె.ప్రతాప్, రవీంద్రకుమార్ పాల్గొన్నారు.

బాణసంచా వ్యాపారులు నిబంధనలు పాటించాలి

ఘంటసాల: దీపావళి సందర్భంగా బాణసంచా వ్యాపారులు నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని ఘంటసాల ఎస్‌ఐ కె.ప్రతాప్‌రెడ్డి సూచించారు. ఘంటసాల పోలీస్ స్టేషన్‌లో ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడారు. ఘంటసాల రెండు, శ్రీకాకుళం, దాలిపర్రులో ఒక్కొక్కటి చొప్పున బాణసంచా దుకాణాలకు అనుమతిచ్చామన్నారు. షాపుల వద్ద ఇసుక, నీటిని సిద్ధంగా ఉంచాలని, అన్ని జాగ్రత్తలు పాటించాలని సూచించారు. అనుమతుల్లేండా బాణసంచా విక్రయించే వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

మూగ జీవాలకు అందని వైద్యం

- పక్కా భవనాలకు నోచుకోని గ్రామీణ పశువైద్య ఉప కేంద్రాలు
- వైఎస్సార్ హయాంలో స్థలాలు కేటాయించిన వైనం
- అప్పటి నుంచి పశువైద్య ఉపకేంద్రాలకు సమకూరని భవనాలు



కె.కొత్తపాలెం గ్రంథాలయం వద్ద ఏర్పాటు చేసిన ట్రైవీస్



కప్తానుపాలెంలో శిథిలావస్థకు చేరిన పశువైద్య ఉపకేంద్రం

మోపిదేవి: గ్రామాల్లో పాడి పరిశ్రమ అభివృద్ధి చెందాలంటే కనీస సౌకర్యాలు ఉండాలి. మూగ జీవాలకు వైద్య సేవలు అందాలి. ప్రభుత్వ పశు వైద్యశాలలను ఏర్పాటు చేయడంతోపాటు, పశువైద్యులను నియమించాలి. అప్పుడే మూగ జీవాలు ఆరోగ్యంగా ఉంటాయి. వాటిపై ఆధారపడిన రైతులకు ఆర్థిక వెసులుబాటు లభిస్తుంది. అయితే మోపిదేవి మండలంలోని పలు గ్రామాల్లో ఉన్న పశువైద్య ఉప కేంద్రాలకు పక్కా భవనాలు సమకూరలేదు. దీంతో పశువులకు సకాలంలో మెరుగైన వైద్యం అందక పాడి రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

స్థలాలు కేటాయించినా..

మోపిదేవి పశువుల ఆస్పత్రి ఒక్కటే గతంలో మండలంలోని 13 పంచాయతీలకు సేవలందించాల్సి వచ్చేది. డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో అప్పటి పశువైద్య శాఖ మంత్రి మండలి బుద్ధప్రసాద్ ఆధ్వర్యంలో మోపిదేవితో పాటు పెదకళ్లేపల్లిలో కూడా పశు వైద్యశాలను నెలకొల్పారు. వాటికి అనుబంధంగా వెంకటాపురం, పెదప్రోలు, బొబ్బర్లంక, నాగాయితిప్పలో గ్రామీణ పశువైద్య ఉపకేంద్రాలు కొనసాగుతున్నాయి. అత్యధికంగా పశుసంపద ఉన్న గ్రామాలైన కోసూరువారిపాలెంలో పాలకేంద్రం వద్ద, కె.కొత్తపాలెంలో పాత గ్రంథాలయ ఆవరణలో పశువైద్య ఉప కేంద్రాలు కొనసాగుతున్నాయి. ఈ రెండు కేంద్రాలకు పక్కా భవనాల నిర్మాణానికి వైఎస్సార్ ప్రభుత్వ హయాంలోనే స్థలాలు కేటాయించారు. ఆ స్థలాలు అప్పటి నుంచి ఖాళీగానే దర్శనమిస్తున్నాయి. దీంతో ఈ గ్రామాల్లో పశువులకు వైద్య సేవలు అందడం లేదు. పశువులకు ఎదైనా అనారోగ్య సమస్య తలెత్తితే సంచార వైద్యశాలలకు లేదా అనుబంధంగా ఉన్న ఉపకేంద్రాలకు తరలించాల్సి వస్తోంది. అధికారులు స్పందించి మూగ జీవాలకు స్థానికంగానే వైద్యసేవలు అందేలా చర్యలు తీసుకోవాలని, కేటాయించిన స్థలాల్లో పక్కా భవనాలు నిర్మించాలని పాడి రైతులు కోరుతున్నారు. శిథిలావస్థకు చేరిన పశు వైద్య ఉప కేంద్రాలకు కూడా నిధులు కేటాయించి మరమ్మతులు చేయించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

శాశ్వత భవనం నిర్మించాలి



మా గ్రామంలో పశువుల ఆస్పత్రికి పక్కా భవనం లేదు. తాత్కాలికంగా పాల కేంద్రం ఆవరణలో పశువైద్య ఉప కేంద్రం కొనసాగుతోంది. వైఎస్సార్ హయాంలో స్థలం ఇచ్చారు. ఆ స్థలంలో శాశ్వత భవనం నిర్మిస్తే మూగజీవాలకు వైద్యం అందుతుంది. ప్రభుత్వం వెంటనేభవన నిర్మాణానికి చర్యలు తీసుకోవాలి.

– గరికిపాటి సాయిబాబు, రైతు, కోసూరువారిపాలెం

మా గ్రామంలోనే పశువులు ఎక్కువ



మండలంలో మా గ్రామంలోనే అత్యధికంగా పశువులు ఉన్నాయి. గతంలో గ్రంథాలయం ఆవరణలో ఆస్పత్రి ఉండేది. తదుపరి పంచాయతీ భవనంలోకి మార్చారు. అక్కడ నుంచి తొలగించడంతో దాతల ఇళ్ల వద్ద కొంత కాలం నడిపారు. ఇప్పుడు పూర్వ గ్రంథాలయం ఆవరణలో ఒక ట్రైవీస్ మాత్రమే ఏర్పాటు చేశారు.

– మత్తి వెంకట బసవయ్య, కె.కొత్తపాలెం

పక్కా భవనంతోనే మేలు



పశు వైద్య ఉప కేంద్రానికి పక్కా భవనం ఉండటం వల్ల వైద్య సిబ్బంది ఎక్కువ సమయం గ్రామంలో సేవలు అందిస్తారు. అవసరమైన మందులను నిల్వ చేసేందుకు కూడా వీలు కలుగుతుంది. ప్రస్తుతం అత్యవసర వేళ గోపాలమిత్రపై ఆధారపడాల్సి వస్తోంది. శాశ్వత భవనం నిర్మిస్తే పశువులకు మేలు కలుగుతుంది.

– తుంగల రేణుకయ్య, కోసూరువారిపాలెం

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తా

పశు వైద్య ఉప కేంద్రాలకు పక్కా భవనాలు కావాలన్న రైతుల విన్నపాలను ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్తా. భవనాల నిర్మాణానికి నిధులు మంజూరయ్యేలా కృషిచేస్తా. వైద్య సిబ్బంది ఎప్పుడూ అందుబాటులోనే ఉంటారు. అవసరమైతే గోపాలమిత్రను వినియోగించవచ్చు. గత ప్రభుత్వం సంచార పశువైద్య వాహనాలను అందుబాటులోకి తీసుకురావడంతో స్థానికంగానే పశువులకు వైద్యం అందుతోంది.

– డాక్టర్ నందకిషోర్, మండల పశువైద్యాధికారి, మోపిదేవి

పెడన అభివృద్ధికి ప్రణాళికాబద్ధంగా కృషి



పెడన: పట్టణ అభివృద్ధికి ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తున్నామని మున్సిపల్ చైర్‌పర్సన్ కటకం నాగకుమారి పేర్కొన్నారు. కౌన్సిల్ సమావేశం బుధవారం చైర్‌పర్సన్ అధ్యక్షతన జరిగింది. సీనియర్ కౌన్సిలర్ కటకం ప్రసాద్ మాట్లాడుతూ.. అనధికారిక లే అవుట్లపై ఏ చర్యలు తీసుకుంటున్నారని ప్రశ్నించారు. గత సమావేశంలో ఈ అంశంపై చర్చించినా ఇప్పటి వరకు చర్యలు తీసుకోలేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. దీనిపై టీపీఓ సృజన కుమారి స్పందిస్తూ.. తాను కొత్తగా వచ్చానని, గుర్తించిన 43 అనధికార లే అవుట్‌లకు సంబంధించిన వివరాలతో మున్సిపల్ ఆఫీస్ ఆవరణలో ఫ్లెక్సీ ఏర్పాటు చేశామని బదులిచ్చారు. మున్సిపల్ కార్యాలయానికి సంబంధించి రెండేళ్ల క్రితం మాయమైన ఏసీ ఇటీవల దొరికిన ఘటనపై సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ వ్యవహారంపై సమగ్రంగా విచారణ నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వైస్‌చైర్మన్ మహ్మద్ ఖాజా, కౌన్సిలర్లు మట్టాపావని, గరికముక్కు చంద్రబాబు, కమిషనర్ గోపాలరావు పాల్గొన్నారు.

4 నుంచి ఉపాధి గ్రామసభలు

నాగాయలంక: జాతీయ ఉపాధి హామీ పథకంలో 2025–26 ఆర్థిక సంవత్సరానికి పనుల గుర్తింపు, ఆమోదం కోసం నవంబర్ 4 నుంచి 15 వరకు గ్రామసభలు జరుగుతాయని ఎంపీడీఓ జె.కె.సీతారామ్ కుమార్, ఏపీఓ టి.వి.ఎస్.ముత్యాలు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని 22న పంచాయతీల పరిధిలో గ్రామసభలు జరుగుతాయని పేర్కొన్నారు. సభ జరిగే ముందు పంచాయతీ కార్యదర్శులు ఆయా గ్రామాల్లో టాంటాం వేయించాలని ఆదేశించారు. సభ రోజున గ్రామాల్లో ప్రజాప్రతినిధులు, మేట్లు, డ్వాక్రా స్వయం సహాయక సంఘాల సభ్యులు, రైతులు హాజరయ్యేలా సహకరించాలని కోరారు.

మచిలీపట్నంలో దీపావళి హడావుడి



హౌసింగ్‌బోర్డు సర్కిల్ సమీపంలో బాణసంచా స్టాళ్లు



పూలు కొనుగోలు చేస్తున్న ప్రజలు

మచిలీపట్నంటౌన్: నగరంలో దీపావళి హడావుడి నెలకొంది. గురువారం దీపావళి పండుగను ఆనందోత్సాహాలతో నిర్వహించుకునేందుకు నగర ప్రజలు సిద్ధమయ్యారు. నగరంలోని ప్రధాన రహదారిలో బుధవారం ప్రమిదలు, పూల విక్రయాలు జోరుగా సాగాయి. ప్రజలు రంగురంగుల విద్యుత్ దీపాలతో గృహాలను, దుకాణాలను అలంకరించారు. ప్రమిదలకు బదులు పలు ఆకృతుల్లోని విద్యుత్‌దీపాలు, బ్యాటరీతో వెలిగే లాంతర్లు, కొవ్వొత్తులు, ప్రమిదలను పలు దుకాణాల్లో విక్రయించారు. నగరంలోని హౌసింగ్‌బోర్డు సర్కిల్ సమీపంలో, పెడన బైపాస్ రోడ్డు కార్నర్ వద్ద రెండు ప్రదేశాల్లో బాణసంచా స్టాళ్లను ఏర్పాటు చేశారు. ఈ దుకాణాలను అధికారులు నిబంధనలను పక్కనపెట్టి పెట్రోల్ బంక్‌ల సమీపంలో ఏర్పాటు చేశారనే ఆరోపణలు వినవస్తున్నాయి. గతంలో నేషనల్ కళాశాల, హిందూ కళాశాల, ఊరి బయట ఉన్న వాసవీ వెంచర్ ప్రాంతాల్లో దుకాణాలను ఏర్పాటు చేసే వారు. అధికార పార్టీ నాయకుల ఒత్తిళ్లకు తలొగ్గిన అధికారులు నిబంధనలను పక్కనపెట్టి పెట్రోల్‌బంక్ సమీపంలో దుకాణాలకు అనుమతులు ఇచ్చారని పలువురు ఆరోపిస్తున్నారు.

కాలేజీ రోడ్డులో మద్యం షాపునకు అనుమతివ్వొద్దు



నిరసన తెలుపుతున్న విద్యార్థినులు, అధ్యాపకులు

అవనిగడ్డ: స్థానిక ఎస్‌వీఎల్ క్రాంతి విద్యాసంస్థల రోడ్డులో మద్యం షాపునకు అనుమతివ్వొద్దని విద్యార్థులు, అధ్యాపకులు బుధవారం నిరసన తెలిపారు. రెండు బ్యాంకులు, కాలేజీ ఉన్న ఈ రోడ్డులో మద్యం షాపు ఏర్పాటు చేస్తే విద్యార్థినులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటారని కళాశాల కరస్పాండెంట్ దుట్టా ఉమామహేశ్వరరావు తెలిపారు. మందు బాబుల ఆగడాల వల్ల విద్యార్థినులతో పాటు బ్యాంకులకు వచ్చే ఖాతాదారులు తీవ్ర అసౌకర్యానికి గురవుతారని చెప్పారు. ఈ రోడ్డులో ఏర్పాటు చేయాలనుకుంటున్న మద్యం షాపును వేరొక ప్రాంతానికి తరలించాలని లేదంటే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అశ్వరావుపాలెం, లంకమ్మ మాన్యం, రాజశేఖరపురం గ్రామాలకు వెళ్లేందుకు ఇదే ప్రధాన రహదారని, మద్యం షాపు ఏర్పాటు నిర్ణయాన్ని మార్చుకోవాలని ఆయన ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు విద్యార్థినులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

భూ సమస్యలకు తక్షణ పరిష్కారం

గూడూరు: రీ సర్వే గ్రామసభల్లో భూ సమస్యలపై వచ్చిన అర్జీలను విచారించి త్వరితగతిన పరిష్కరిస్తామని రీ సర్వే విభాగం గూడూరు డెప్యూటీ తహసీల్దారు కె.జ్ఞానరాజ సాయి పేర్కొన్నారు. మండలంలోని పినగూడూరులంకలో బుధవారం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా డీటీ మాట్లాడుతూ.. రీ సర్వే గ్రామసభల్లో వచ్చిన ఫిర్యాదులపై క్షేత్రస్థాయిలో రెవెన్యూ సిబ్బంది విచారణ నిర్వహించి సమస్యలను పరిష్కరిస్తారన్నారు. తద్వారా రైతులు ఎదుర్కొంటున్న భూ సమస్యలకు శాస్వత పరిష్కారం లభిస్తుందన్నారు. కార్యక్రమంలో మండల సర్వేయరు కె.మురళీ కృష్ణ, మండల కో ఆప్షన్ సభ్యుడు కరీముల్లా, గ్రామ సర్వేయర్ రాము, పలువురు రైతులు పాల్గొన్నారు.

రీ సర్వేతో సమస్యల పరిష్కారం

మేళ్లమర్రు(మోపిదేవి): రీ సర్వే వల్ల రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించుకోవచ్చని మండల ఉపాధ్యక్షుడు కడవకొల్లు సీతా రామాంజనేయులు అన్నారు. మండలంలోని మేళ్లమర్రు గ్రామంలో రీసర్వే ప్రాజెక్టుపై పంచాయతీ కార్యాలయం వద్ద బుధవారం గ్రామసభ జరిగింది. మండల సర్వేయర్ రామకృష్ణబాబు మాట్లాడుతూ.. అడంగల్, పాస్‌బుక్, సర్వే నంబర్లలో మార్పుల వల్ల గతంలో రైతులు అనేక ఇబ్బందులు పడేవారని, గత ప్రభుత్వంలో రీ సర్వే చేపట్టడం వల్ల ఆ సమస్యలను పరిష్కరించుకోవడానికి అవకాశం ఏర్పడిందని తెలిపారు. ప్రతి సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించే స్పందనలో రీ సర్వేకు దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. అనంతరం ఐదుగురు రైతుల నుంచి పలు అభ్యంతరాలపై అర్జీలు స్వీకరించారు. అనంతరం ఏఓ హెప్సిబారాణి ఖరీఫ్ సాగులో ధాన్యం కొనుగోలుపై రైతులకు అవగాహన కల్పించారు. ఇన్‌చార్జీ ఆర్‌ఐ ఎం.శ్రీనివాస రావు, వీఆర్వోలు ప్రసాద్, అరజా కిరణ్‌కాంత్, గ్రామ సర్వేయర్లు నవీన్, గోపీరాజు తదితరులు పాల్గొన్నారు.

నాటు కోళ్ల పెంపకంతో అధిక లాభాలు

ఉత్తరచిరువోలులంక(మోపిదేవి): గ్రామీణ ప్రాంతాల్లో తమకున్న కొద్దిపాటి స్థలం, పొలం వద్ద కొత్తరకం నాటుకోళ్లను తక్కువ పెట్టుబడితో పెంచి అధిక లాభాలు పొందొచ్చని కేవీకే ఘంటసాల ప్రోగ్రాం కో–ఆర్డినేటర్ డాక్టర్ సుధారాణి సూచించారు. మండలంలోని ఉత్తరచిరువోలులంక, మేళ్లమర్తిలంక గ్రామాల్లో బుధవారం కేవీకే ఆధ్వర్యంలో డ్వాక్రా మహిళలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. మత్స్య శాస్త్రవేత్త జె.యశ్వంత్ కుమార్ మాట్లాడుతూ.. దేశవాళీ కోళ్ల జాతులు, అభివృద్ధి పరిచిన కోళ్ల జాతులు, వాటి మేత, నీటి యాజమాన్యం, కోడి పిల్లలకు వ్యాక్సినేషన్, కోళ్లకు వచ్చే వ్యాధులు, వాటి నివారణపై అవగాహన కల్పించారు. గృహ విజ్ఞాన శాస్త్రవేత్త జి.కృష్ణవేణి మాట్లాడుతూ.. చిరుధాన్యాలతో విలువ ఆధారిత ఉత్పత్తులు, వాటిలో లభించే పోషక విలువలు, స్వయం ఉపాధి మార్గాలను వివరించారు.

రిటైర్డ్ ఉద్యోగులకు ఘన సన్మానం



గురవయ్యను సన్మానిస్తున్న సర్పంచ్ శ్రీనివాస రావు, మండల ఉపాధ్యక్షురాలు జననీ కుమారి



హెడ్ కానిస్టేబుల్ శాంతకుమార్ దంపతులను సన్మానిస్తున్న డీఎస్పీ మురళీధర్

మోపిదేవి: పాఠశాల విద్యార్థుల సంఖ్య పెంచడంలో ఉపాధ్యాయుడు అడపా గురవయ్య కృషి మరువలేనిదని సర్పంచ్ చింతా శ్రీనివాసరావు పేర్కొన్నారు. మండలంలోని ఉత్తరచిరువోలులంక ప్రాథమికోన్నత పాఠశాలలో ఉద్యోగ విరమణచేసిన ఉపాధ్యాయుడు గురవయ్యను కాంప్లెక్స్ స్థాయిలో బుధవారం ఘనంగా సన్మానించారు. హెచ్ఎం నడకుదుటి ఉమామహేశ్వరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎంఈఓ–1 దుర్గాసాగర్, ఎంఈఓ–2 అన్నపరెడ్డి పిచ్చయ్య, కోడూరు ఎంఈఓ–2 విశ్వనాథపల్లి శ్రీనివాసరావు, చల్లపల్లి ఎంఈఓ–1 హరిగోపాల్, మండల ఉపాధ్యక్షురాలు నడకుదుటి జననీ కుమారి, ఎస్ఎంసీ కమిటీ చైర్మన్ ఎల్.లలిత, కాంప్లెక్స్ చైర్మన్ కృష్ణకుమారి, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత కొక్కిలిగడ్డ మణిప్రభాకర్, నవజీవన విద్యాసంస్థల చైర్మన్ కొండవీటి ఈశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

హెడ్ కానిస్టేబుల్ దంపతులకు సత్కారం

మోపిదేవి పోలీస్ స్టేషన్‌లో పనిచేసి ఉద్యోగ విరమణ చేసిన హెడ్ కానిస్టేబుల్ డి.శాంతకుమార్ దంపతులను ఘనంగా సన్మానించారు. స్టేషన్‌లో జరిగిన సత్కార కార్యక్రమంలో శాంతకుమార్ సేవలను వక్తలు కొనియాడారు. అవనిగడ్డ డీఎస్పీ మురళీధర్, చల్లపల్లి, అవనిగడ్డ సీఐలు ఈశ్వరావు, యువ కుమార్, సబ్‌డివిజన్ ఎస్‌ఐలు, శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయ డెప్యూటీ కమిషనర్ దాసరి శ్రీరామ వరప్రసాద రావు, పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

నదిలోకి వెళ్లేందుకు దారి చూపరూ..



తహసీల్దార్ విజయప్రసాద్‌కు వినతిపత్రం ఇస్తున్న గ్రామస్తులు, రైతులు

ఘంటసాల: అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి చనిపోయిన వారి అంత్యక్రియలు నిర్వహించేందుకైనా కృష్ణానదిలోకి వెళ్లేందుకు దారి కల్పించాలని కోరుతూ ఘంటసాల మండలం పాపవినాశనం గ్రామస్తులు తహసీల్దార్ బి.విజయ ప్రసాద్‌కు బుధవారం అర్జీ సమర్పించారు. పాపవినాశనం గ్రామస్తులు మాట్లాడుతూ.. తమ గ్రామంలోని ఎస్సీలకు గతంలో ప్రభుత్వం కృష్ణానదిలోని లంకలో భూములు కేటాయించారు. ఇటీవల సొసైటీకి చెందిన ఎస్సీలు పాపవినాశనం గ్రామంలోని కృష్ణానదిలోకి ఎవరూ వెళ్లడానికి వీలు లేదంటూ కృష్ణా పుష్కరాల సమయంలో నిర్మించిన రోడ్డును ఐదు అడుగుల లోతు, నాలుగు అడుగుల వెడల్పున జేసీబీతో తవ్వించారని వాపోయారు. చనిపోయిన వారి అంత్యక్రియలకు, పశువులు, మేకలు, గొర్రెలు, ఇతర మూగజీవాలు తాగునీటి కోసం కృష్ణానదిలోకి వెళ్లేందుకు వీలు లేకుండా పోయిందని పేర్కొన్నారు. అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి గండి పూడ్చించి తమకు కృష్ణానదిలోకి వెళ్లేందుకు దారి ఇప్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు జి.వెంకట్రామయ్య, బి.హరీష్, డి.రాంబాబు, డి.వెంకట్రామయ్య, కె.బాచీ, జి.గోపిరాజు, కె.రాంబాబు, కె.ధనుష్, జి.జీసస్ బాబు, వి.హరివర్మ, కె.చంద్రం, డి.శ్రీను, డి.వెంకటేశ్వరరావు, జి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సోలార్ విద్యుత్ సబ్సిడీని సద్వినియోగం చేసుకోవాలి



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న బుద్ధప్రసాద్ తదితరులు

అవనిగడ్డ: సోలార్ విద్యుత్‌పై ప్రభుత్వం ఇస్తున్న సబ్సిడీని వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ సూచించారు. స్థానిక తన కార్యాలయంలో బుధవారం ఆయన సోలార్ ప్లాంటు ఏర్పాటుపై అందిస్తున్న సబ్సిడీ వివరాల కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఉయ్యూరు డివిజన్ ఈఈ డి.కృష్ణనాయక్, అవనిగడ్డ డీఈ ఎన్.సుబ్రహ్మణ్యేశ్వరరావు, ఏఓ వెంకటేశ్వర రావు, ఏఈలు సత్యనారాయణ, ప్రసాద్, జనసేన నాయకుడు మండలి వెంకట్రామ్ పాల్గొన్నారు.

సీసీ రోడ్ల నిర్మాణంకు శంకుస్థాపన

మోదుమూడిలో ఉపాధి హామీ పథకం నిధులు రూ.20 లక్షలతో నిర్మించనున్న నాలుగు సీసీ రోడ్ల నిర్మాణానికి ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బచ్చు బేబీ, ఎంపీపీ తుంగల సుమతీదేవితో పాటు పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

నరకాసుర దహనం



చల్లపల్లి(అవనిగడ్డ): చల్లపల్లి మండల పరిధిలోని నడకుదురు గ్రామంలో బుధవారం రాత్రి నరకాసుర దహనం జరిగింది. ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ నిప్పుతో ఉన్న బాణాన్ని సంధించి నరకాసుర దహన కార్యక్రమాన్ని ప్రారంభించారు. తొలుత బుద్ధప్రసాద్, విజయలక్ష్మి దంపతులు పృథ్వీశ్వర స్వామిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేయించారు. వేదపండితుడు కంఠంరాజు సాయి దీక్షితులు ఆధ్వర్యంలో పురోహితులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. నాదెళ్ల ప్రభాకరరావు, యార్లగడ్డ శ్రీనివాసరావు, నాదెళ్ల వెంకట నరసయ్య, నిడమానూరి దిలీప్‌కుమార్ పాల్గొన్నారు.

కృష్ణమ్మ చెంత శ్రీరామలింగేశ్వరుడికి అభిషేకాలు

నాగాయలంక: మాస శివరాత్రిని పురస్కరించుకుని స్థానిక శ్రీరామ పాద క్షేత్రం వద్ద కృష్ణానది మండపంలోని శ్రీగంగ పార్వతీ సమేత రామలింగేశ్వర స్వామికి బుధవారం విశేష అభిషేకాలు, ప్రత్యేక పూజలు జరిపారు. అర్చకుడు అంబా సాయికిరణ్ శర్మ నేతృత్వంలో తొలుత అయ్యప్ప స్వాములు, క్షేత్రం చైర్మన్ ఆలూరి శ్రీనివాసరావు శివలింగానికి పసుపు, కుంకుమ, నారికేళం, గోక్షీరం, సుగంధ ద్రవ్యాలతో అభిషేకాలుచేశారు. అనంతరం శివయ్యకు, నందీశ్వరుడికి పూజలు చేశారు. మండలంలోని పలు గ్రామాల నుంచి భక్తులు వచ్చి రామలింగేశ్వరుడికి స్వీయ అభిషేకాలు చేశారు.

లంక సుబ్రహ్మణ్యేశ్వరుడికి విశేష అలంకరణ



నాగాయలంక: నరకచతుర్థి, మాస శివరాత్రిని పురస్కరించుకుని గ్రామంలోని పురాతన శ్రీవల్లీ దేవసేన సమేత శ్రీసుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవస్థానంలో స్వామికి బుధవారం ప్రత్యేక అభిషేకాలు, పూజలు చేశారు. స్వామికి విశేష అలంకరణ చేశారు. ఆలయ అర్చకుడు అంబా సాయికిరణ్ శర్మ అర్చకత్వంలో వేకువ జాము నుంచే పూజలు జరిగాయి. మధ్యాహ్నం దాతల ఆర్థిక సౌజన్యంతో ఆలయ ప్రాంగణంలోని స్వచ్ఛంద అన్నదాన సేవా కమిటీ ఆధ్వర్యంలో పేద వృద్ధులు, దివ్యాంగులకు అన్నప్రసాద వితరణ చేశారు. పొన్నపల్లి చిన్నా, లంకమ్మ, మత్తి శేషుబాబు, బాబూరావు తదితరులు సేవలు అందించారు.

సాగులో యాజమాన్యపద్ధతులు పాటించాలి

పెదకళ్లేపల్లి(మోపిదేవి): పంటల సాగులో యాజమాన్య పద్ధతులు పాటించాలని వ్యవసాయ శాఖ అవనిగడ్డ సహాయ సంచాలకుడు జె.ఎస్.జయప్రద తెలిపారు. మండలంలోని పెదకళ్లేపల్లిలో బుధవారం 'పొలం పిలుస్తోంది' జరిగింది. జయప్రద మాట్లాడుతూ.. పంట పొలాల్లో యాజమాన్య పద్ధతులు పాటించాలని, చీడపీడల నివారణకు వ్యవసాయ అధికారుల నుంచి తగిన సలహాలు తీసుకోవాలని సూచించారు. మండల వ్యవసాయాధికారి కె.హెప్సిబారాణి పాల్గొన్నారు.